ప్రజాశక్తి

మంగళవారం 7 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



గుంటూరు ధర్నాలో మాట్లాడుతున్న రమాదేవి



నరసరావుపేటలో ధర్నా

గొంతెమ్మ కోర్కెలేమీ కాదు..

- కనీస వేతనాలు అమలు చేయండి
- గుంటూరు, పల్నాడు కలెక్టరేట్‌ల వద్ద అంగన్వాడీల భారీ ధర్నాలు
- నరసరావుపేటలో నిరసన ప్రదర్శన
- కలెక్టర్లకు వినతి పత్రాలు

ప్రజాశక్తి - గుంటూరు, నరసరావుపేట

అంగన్‌వాడీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు దయా రమాదేవి, ముజఫర్ అహ్మద్ విమర్శించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గుంటూరు, పల్నాడు కలెక్టరేట్ల ఎదుట అంగన్వాడీలు సోమవారం భారీ ధర్నాలు నిర్వహించగా అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం స్పందనలో కలెక్టర్లకు వినతిపత్రాలిచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మున్సిపల్ గాంధీ పార్కు నుండి ప్రదర్శన చేశారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట పోలీసులు అడ్డుకోవడంతో ధర్నా చేశారు. కొద్ది సేపటికి కొంతమందిని అనుమతించడంతో వెళ్లి సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. గుంటూరులో ధర్నాకు యూనియన్ నాయకులు టి.రాధ అధ్యక్షత వహించారు.

రమాదేవి మాట్లాడుతూ తాము గొంతెమ్మ కోర్కెలు కోరట్లేదని, ప్రభుత్వ వాగ్దానాలు, కార్మికులకు ఉన్న హక్కులే అడుగుతున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఉండాలని, ఇది అంగన్‌వాడీలకు అమలు కావట్లేదని అన్నారు. సేవ పేరుతో ఐదేళ్ల ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు రూ.లక్షల్లో జీతాలు, పెన్షన్ పొందుతున్నారని, కష్టపడి పనిచేసిన వారికి మాత్రం మొండిచేయి చూపిస్తున్నారని విమర్శించారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగులంటూ సంక్షేమ పథకాలు కత్తిరిస్తున్న ప్రభుత్వం కనీస వేతనాలు అడుగుతుంటే మాత్రం మీరు ఉద్యోగులు కాదంటూ చెప్పటం ప్రభుత్వాల ద్వంద్వ నీతికి నిదర్శమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలప్పుడు అంగన్వాడీలకు ఇచ్చిన

▶ 2లో

నమ్మకంగా కొని.. ఆపై ఎగవేసి..

- పొన్నూరు మండలంలో రూ.3 కోట్లు, దొడ్లేరులో రూ.30 లక్షలు బకాయిలు - పత్తి రైతులకు రూ.80 లక్షలఎగవేత
- పంట కొనుగోలులో పెరుగుతున్న వ్యాపారుల మోసాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రైతుల వద్ద పంటను నమ్మకంగా కొనుగోలు చేసి ఆ తర్వాత డబ్బులివ్వకుండా మోసం చేస్తున్న వ్యాపారుల సంఖ్య గుంటూరు, పల్నాడు జిల్లాల్లో క్రమంగా పెరుగుతోంది. రైతుల వద్ద పంటను కొని సొమ్ము ఎగవేతకు పాల్పడిన పలువురి ఉదంతం వెలుగులోకి వచ్చింది. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం చట్టుబడితండాకు చెందిన బాలాజీ నాయక్ దొడ్లేరులో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేశారు. అయితే వారికి ఇవ్వాల్సిన రూ.30 లక్షలను బాలాజీనాయక్ ఎగవేశారు. దీంతో రైతులు సోమవారం స్పందనలో పల్నాడు ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. బాలాజీనాయక్ క్రోసూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ధాన్యం కొని పిడుగురాళ్లలోని ఒక మిల్లుకు విక్రయించాడు. మిల్లరు వద్ద రూ.30 లక్షలు సొమ్ము తీసుకుని వాటిని రైతులకు ఇవ్వకుండా ముఖంచాటేశాడు. రైతులు ఫోన్ చేసి అడిగితే 'నేను ఐపి పెడుతున్నా.. మీఇష్టం వచ్చింది చేసుకోండి..' అని దురుసుగా మాట్లాడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. 30 మంది రైతుల నుంచి 1800 బస్తాల ధాన్యాన్ని బాలాజీనాయక్ కొనుగోలు చేసి గత 40 రోజులుగా డబ్బు ఇవ్వకుండా అదిగో..ఇదిగో అంటూ తిప్పుతూ ఇప్పుడు గ్రామం నుంచి ఉడాయించాడు.



గుంటూరు ఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

పొన్నూరు మండలం మునిపల్లె, దండమూడి, మామిళ్లపల్లికి చెందిన రైతులు దాదాపు 30 మంది రైతులు సోమవారం గుంటూరులో ఎస్‌పిని కలిశారు. మునిపల్లెలోని శ్రీసీతారామ రైసు మిల్లు వారికి ధాన్యం విక్రయించగా ఇంత వరకు తమకు సొమ్ము ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతేడాది నుంచి చెల్లించాల్సిన బకాయిలు రూ. 3కోట్ల వరకు ఉన్నాయని,

▶ 2లో







భర్తతో మృతురాలు శివలింగేశ్వరి (ఫైల్). మృతులు చరణసాయిరెడ్డి, జతిన్‌రెడ్డి

బిడ్డలకు ఉరేసి తల్లి ఆత్మహత్య

ప్రజాశక్తి - నరసరావుపేట

కుటుంబ కలహాల నేపథ్యంలో మహిళ తన ఇద్దరు పిల్లలకు ఉరేసి ఆపై తానూ ఉరేసుకున్న సంఘటన పల్నాడు జిల్లా నరసరావుపేటలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రొంపిచర్ల మండలం నల్లగార్లపాడుకు చెందిన మల్లెల వెంకటేశ్వరరెడ్డి, ద్రాక్షాయని దంపతుల కుమార్తె శివలింగేశ్వరి (27)కి వినుకొండ మండలం విఠంరాజుపల్లికి చెందిన దొండేటి ఇంద్రారెడ్డికి 2015లో వివాహమైంది. వీరికి చరణసాయిరెడ్డి(8), జతిన్‌రెడ్డి(4) అనే ఇద్దరు కుమారులున్నారు. ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తున్న ఇంద్రారెడ్డి నరసరావుపేట పట్టణంలో పెద్ద చెరువు మహాలక్ష్మి నగర్లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మృతురాలు శివలింగేశ్వరి భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని శివలింగేశ్వరిని హింసించినట్లు, కుటుంబం పట్ల

▶ 2లో

ప్రజల్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

- రాయితీల కోతతో భారం కానున్న గ్యాస్, ఎరువుల ధరలు
- 22-28 తేదీల్లో దేశవ్యాప్తంగా నిరసనలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య

మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు



ప్రజాశక్తి - నరసరావుపేట

పార్లమెంట్‌లో ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రజల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించిందని, కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఈనెల 22-28 తేదీల్లో దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. మోసపూరితంగా వ్యాపారం చేస్తున్న అదానీ బండారం బయటపడిందని, అయినా కార్పొరేట్లకే దాసోహం అన్నట్లు ప్రధాని మోడీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయనాయక్ అధ్యక్షత వహించారు. బాబూరావు మాట్లాడుతూ 100 కుటుంబాలకు వచ్చే ఆదాయంలో 1 శాతం పన్నులు విధించినా దేశంలో అన్ని రంగాలకు కేటాయింపులు పెంచొచ్చని, అందుకూ కేంద్రం సిద్ధం కాలనేదని అన్నారు. వంటగ్యాస్, ఎరువులు, పెట్రోలియం, ఆహార ఉత్పత్తులకు రాయితీని ఎత్తేశారని,

▶ 2లో



బ్యాంకుకు తాళం వేసి ఆందోళన చేస్తున్న బాధితులు, బంగారంపై వివరణ ఇస్తున్న ఎజిఎం రవీంద్రనాయక్ (ఇన్‌సెట్)

బంగారం డబ్బును నెలలో ఇస్తాం

- యూనియన్ బ్యాంకు ఎంజిఎం హామీ
- రెంటపాళ్ల శాఖకు తాళాలేసి బాధితుల ఆందోళన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

బంగారం మాయంపై ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నెలరోజుల్లో బంగారం ధరను చెల్లిస్తామని యూనియన్ బ్యాంక్ ఎజిఎం ఎం.రవీంద్ర నాయక్ ఖాతాదారులకు హామీనిచ్చారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల యూనియన్ బ్యాంక్‌లో ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారం మాయంపై ఖాతాదారులు సోమవారం మరోసారి ఆందోళన చేపట్టారు. బ్యాంకుకు తాళం వేసి బ్యాంకు సిబ్బందిని అడ్డుకున్నారు. తమ

▶ 2లో

గొంతెమ్మ కోర్కెలేమీ కాదు..

(మొదటి పేజీ తరువాయి)

హామీలను అమలు చేయకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఫుడ్ కమిషన్ పేరుతో అంగన్వాడీలను వేధింపులకు గురి చేస్తున్న చైర్మన్ పద్ధతి మార్చుకోకుంటే ఆందోళన చేయాల్సి వస్తుందన్నారు. అంగన్వాడీలపై అధికార పార్టీ నాయకుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వెలిబుచ్చారు. నెలల తరబడి వేతనాలు, బిల్లులు చెల్లించకపోతే అంగన్‌వాడీల కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. పెట్రోలు, డీజిల్, నిత్యావసర సరుకులన్నీ పెంచారని, వేతనాలు మాత్రం పెరగట్లేదన్నారు. అంగన్‌వాడీల హక్కుల కోసం ఏప్రిల్ 5న జరిగే ఛలోఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ యూనియన్ గుంటూరు జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మెటిల్లాదేవి, నాయకులు జి.మల్లేశ్వరి, డి.శివకుమారి మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూకు తగిన విధంగా ఛార్జీలు పెంచాలని, అంగన్వాడీలకు టిఎ బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరారు. అంగన్వాడీలకు సంబంధం లేని బిఎల్ఓ డ్యూటీలను బలవంతంగా కేటాయించొద్దని, పెండింగ్ వేతనాలు, బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫేస్ రికగ్నైజేషన్ యాప్ నుండి అంగన్‌వాడీలకు మినహాయింపు ఇవ్వాలన్నారు. జాబ్ క్యాలెండర్ నిర్ణయించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, సర్వీస్‌లో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాలపై ఉక్కు పాదాన్ని మోపే విధానాన్ని మానుకోవాలని హితవు పలికారు. గుంటూరు ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి దీప్తి మనోజ, నాయకులు సుకన్య, సరళ, రత్నమంజుల, కృష్ణ కుమారి, ఎల్.అరుణ పాల్గొన్నారు. నరసరావుపేట ధర్నాలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శులు సిలార్ మసూద్, టి.శ్రీనివాసరావు, ఎం.హరిపోతురాజు, యూనియన్ జిల్లా కోశాధికారి ప్రసన్న, ప్రాజెక్టు కార్యదర్శులు కవిత, నిర్మల, షేక్ హజారా, శాంతకుమారి, ఎం.మణికుమారి, దేవకుమారి పాల్గొన్నారు.

అరవిందబాబు సంఘీభావం.. మోహరించిన పోలీసులు

అంగన్వాడీల ధర్నా సమాచారాన్ని ముందుగానే తెలుసుకున్న పోలీసులు కలెక్టరేట్ వద్ద ఉదయం 10 గంటల నుండే భారీగా మోహరించారు. అంగన్వాడీలు ప్రదర్శనగా నినాదాలు చేస్తూ కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు వద్దకు రాగానే కలెక్టరేట్ గేటు మూసి తాళం వేసి అంగన్వాడీలను అడ్డుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకూ అంగన్వాడీలు ఎండలోనే అక్కడ నిరసన తెలిపారు. అనంతరం పది మందిని లోపలికి అనుమతించారు. ధర్నాకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదలవాడ అరవిందబాబు సంఘీభావం తెలిపారు. స్థానిక రైల్వే గేటు వద్ద ర్యాలీలో కలిసిన ఆయన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్నారు. అడ్డుకున్న పోలీసుల తీరును విమర్శించారు.





నరసరావుపేటలో నిరసన ప్రదర్శన చేస్తున్న అంగన్వాడీలు, ప్రదర్శన ముందు భాగంలో నాయకులు



గుంటూరు ధర్నా శిబిరంలో అంగన్వాడీలు

నమ్మకంగా కొని.. ఆపై ఎగవేసి..

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని నెలలుగా ఎన్నిసార్లు అడిగినా ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వట్టికూటి రామ రాయలు, వట్టికూటి సత్యసాయిబాబు, వట్టికూటి రామనారాయణ తమ సొమ్ము ఇవ్వకుండా ఊరు విడిచి వెళ్లినట్టు రైతులు వాపోయారు. అయితే వ్యాపారులు తమకు అనుకూలంగా ఉన్నవారికి చెల్లించి మిగతా వారికి ఇవ్వడం లేదని ఎస్‌సి, ఎస్‌టి రైతులు వాపోయారు. తమను కులం పేరుతో మాట్లాడుతూ బెదిరిస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు రావాల్సిన రూ.3 కోట్ల సొమ్ము ఇప్పించాలని వారు ఎస్‌పిని కోరారు.

మరోవైపు తమ వద్ద పత్తి కొనుగోలు చేసిన వ్యాపారులు సొమ్ము చెల్లించలేదని నల్లపాడులోని శ్రీనివాసా కాటన్ జిన్నింగ్ మిల్లు వద్ద సోమవారం రైతులు ధర్నా చేశారు. రైతులను వ్యాపారులు మోసం చేశారంటూ శ్రీనివాసా కాటన్ జిన్నింగ్ మిల్లు వద్ద రైతుల ధర్నా నిర్వహించారు. గత రెండు నెలల నుండి సుమారు రూ.70 లక్షల వరకు డబ్బులు ఇవ్వకుండా తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం జరిగేంత వరకు ధర్నా ఆపేది లేదన్నారు. పత్తి వ్యాపారి మేడా వాసు మోసం చేశాడంటూ మిల్లు వద్ద రైతులు నిరసన తెలిపారు. ఈ పత్తి మిల్లును అద్దెకు తీసుకుని వేరే వ్యక్తి చేత రైతుల వద్ద పత్తి కొనుగోలు చేయించినట్టు రైతులు తెలిపారు. పెదకూరపాడు, అమరావతి, ప్రత్తిపాడు, చిలకలూరిపేట, క్రోసూరు, సత్తెనపల్లి, మేడికొండూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల రైతులు వద్ద పత్తిని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్వింటాళ్ రూ.9 వేలు కొనుగోలు చేసిన వ్యాపారులు తమకు సొమ్ము చెల్లించడం లేదని ఎవరికి చెప్పుకోలేక గత్యంతరం లేని పరిస్థితిలో ధర్నాకు దిగినట్టు తెలిపారు. రెండు నెలలుగా డబ్బులు ఇస్తామంటూ ఇబ్బందిపెడుతున్నట్టు తెలిపారు. తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి వ్యాపారి నరేంద్ర కిడ్నాప్ కేసులో అరెస్టయిన బర్మా వెంకట్రావు నుంచి తమకు రావాల్సిన పైకం ఇప్పించాలని గుంటూరు, ప్రకాశం జిల్లాల రైతులు రెండు రోజుల క్రితం నగరపాలెం పోలీసు స్టేషన్ ఎదుట నిరసన విషయం తెలిసిందే. ఇలా జిల్లాలో పత్తి, మిర్చి, ధాన్యం రైతులను వ్యాపారులు ఎదో రూపంలో మోసం చేస్తున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. అధికారులు సీరియస్‌గా స్పందించాల్సిన అవసరం ఉంది.

బిడ్డలకు ఉరేసి తల్లి ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

నిర్లక్ష్యంగా వ్యవహరించాడని తమ వద్ద వాపోయినట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. తమ కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ఇంద్రారెడ్డి అతని కుటుంబ సభ్యులు తమ కుమార్తెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. ఇంద్రారెడ్డి, అతని కుటుంబీకులను కఠినంగా శిక్షించాలన్నారు. నరసరావుపేట డీఎస్పీ చినవిజయ భాస్కర్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానియ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శివలింగేశ్వరి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వర్మీ కంపోస్ట్ తయారీ పరిశీలిస్తున్న బృందం

నడిపాలెంలో డిప్యూటీ కలెక్టర్ల బృందం పర్యటన

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండల పరిధిలోని నడింపాలెం గ్రామంలో సోమవారం డిప్యూటీ కలెక్టర్ బృందం పర్యటించింది. చెత్త సేకరణ షెడ్డును పరిశీలించారు. షెడ్డులో జరుగుతున్న వర్మి కంపోస్ట్ తయారీ గురించి పంచాయతీ కార్యదర్శి కాజాను అడిగి తెలుసుకున్నారు. చెత్త వేరు చేయు పద్ధతిని కూడా అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీ రమ్య, ఇఓపిఆర్ డి. మావులూరి మోషే ,పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

ప్రజల్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

రానున్న రోజుల్లో వీటి ధరలు పెరుగుతాయని చెప్పారు. పట్టణాల్లో ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తుంటే నిధుల కోత దారుణమన్నారు. బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ పేరును ఎక్కడా ప్రస్తావించలేదని, రాజధాని అమరావతికి నిధులు కేటాయించలేదని, అమరావతి రైల్వే ప్రాజెక్ట్‌కు నిధులు కోత పెట్టారని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయింపులు తగ్గించారని విమర్శించారు. పోలవరానికి నిధులు ఇవ్వలేదని, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు నిధులు కేటాయించలేదని, ఎస్సీ, ఎస్టీలకు తక్కువ బడ్జెట్ కేటాయించారని చెప్పారు. రాష్ట్రానికి ఇంత ద్రోహం చేస్తున్న మోడీపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. నిధులు సాధించలేదని వైసిపిని విమర్శిస్తున్న చంద్రబాబు నాయుడు మోడీని ఎందుకు ప్రశ్నించడ లేదన్నారు. బడ్జెట్‌పై ఏం అవగాహన ఉండి జనసేన అధినేత పవన్ కల్యాణ్ బాగుందని చెప్పారో సమాధానం చెప్పాలన్నారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఆహార భద్రతకు రూ.90 వేల కోట్లు తగ్గించారన్నారు. దేశ జనాభాలో 80 శాతం మంది ప్రజలు ఉపాధిహామీ పనులకు వెళుతుండగా గతంలో రూ.1.80 లక్షల కోట్లు కేటాయంచగా ప్రస్తుతం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. ఎరువులకు సంబంధించి రూ.50 వేల కోట్లు రాయితీలు ఎత్తేవేసి ఆ భారాన్ని రైతులపై మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి సంబంధించి గ్రీన్ రెవల్యూషన్ విభాగానికి గత బడ్జెట్లో రూ.8700 కోట్లు కేటాయిస్తే ఇప్పుడు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, వ్యవసాయ విద్యాలయాలు, వ్యవసాయ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాట్లు ఏవీ ఉండవని విమర్శించారు. పంటలను బహిరంగ మార్కెట్లో ధరలు తగ్గితే వాటిని కొనుగోలు చేయడానికి గతంలో రూ.7వేల కోట్లు కేటాయించగా వాటిని రూ.3800 కోట్లకు తగ్గించి రైతులకు తీరని ద్రోహం చేశారన్నారు. ఫుడ్ కార్పొరేషన్‌కు రూ.15 వేల కోట్లు కోతల విధించారని, పత్తి కొనుగోలు కేంద్రాలను పూర్తిగా మూసేశారని విమర్శించారు. వీటన్నింటిపైనా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, వై.గోపాలరావు, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, జి.రవిబాబు, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, డి.విమల, కె.హనుమంత్‌రెడ్డి, పి.మహేష్, జి.బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆర్ఓఎఫ్ఆర్ పెండింగ్ క్లైమ్‌లను గుర్తించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆర్ఓఎఫ్ఆం పెండింగ్ క్లైమ్‌లను గుర్తించాలని, అందుకు సంభంధించిన సాఫ్ట్‌వేర్‌ను పల్నాడు జిల్లాలో త్వరితగతిన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వైఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆర్ఓఎఫ్ఆర్‌కు సంబంధించి జిల్లాస్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్ఆర్‌సి స్థాయిలో పెండింగ్ క్లైములు ఎన్ని ఉన్నాయి, మండల డివిజన్ జిల్లా స్థాయిలో ఎన్ని ఉన్నాయని వివరాలను రూపొందించాలన్నారు. నకరికల్లు మండలంలో 53 మంది లబ్ధిదారులకు 116 ఎకరాలు, పిడుగురాళ్ల మండలంలో 9 మంది లబ్ధిదారులకు14.07 ఎకరాలు, మాచర్ల మండలంలో 66 మందికి 93.5 ఎకరాలు, రాజుపాలెం మండలంలో ఒకరికి 1.3 ఎకరాలు, వెరసి 129 మంది లబ్ధిదారులకు 225.4 ఎకరాల పంపిణీకి కమిటీ ఆమోదం తెలిపింది. ట్రైబల్ గ్రామాలలో, రోడ్లు విద్యుత్ తదితర మౌలిక వసతులు సమస్యలను గుర్తించి నివేదికను రూపొందించాలన్నారు. లబ్ధిదారులకు కేటాయించిన భూములలో సరిహద్దు రాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా అటవీ భూమిని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయక, జిల్లా ఫారెస్ట్ అధికారి రామచంద్ర రావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వరలక్ష్మి, రెవెన్యూ డివిజనల్ అధికారులు రాజకుమారి, అద్దయ్య, మండల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం డబ్బును నెలలో ఇస్తాం

(మొదటి పేజీ తరువాయి)

బంగారం ఎప్పుడు ఇస్తారో చెప్పాలని, అప్పటి వరకూ లోపలికి వెళ్లనివ్వబోమని పట్టుబట్టారు. ఇది తెలిసిన బ్యాంక్ జోనల్ అధికారులు హుటాహుటిన రెంటపాళ్లకు చేరుకున్నారు. బాధితులతో బ్యాంకు ఎజిఎం రవీంద్ర నాయక్ మాట్లాడారు. బంగారం పోయిన ప్రతి ఒక్కరికీ హామీ పత్రాలు. రాసిస్తామని, నెలలో డబ్బులు ఇస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.

తాగు నీరు కొరత లేకుండా చర్యలు

ప్రజాశక్తి-తాడేపల్లి :ఉండవల్లి గ్రామంలో తాగునీరు కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మంగళగిరి -తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో ఉండవల్లి లో గుంటూరు ఛానల్ కెనాల్ కట్ట వద్ద నూతనంగా నిర్మించిన ప్రెజర్ శాండ్ ఫిల్టర్‌లను ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ ఉండవల్లిలో తాగునీరు ప్రతి ఒక్కరికి అందాలనే ఉద్దేశంతో ఈ ఫిల్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి మరొక 3 ప్రెజర్ శాండ్ ఫిల్టర్‌లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. ఈ ప్రెజర్ అండ్ ఫిల్టర్ల ద్వారా ఉండవల్లిలో ఏఏ ప్రాంతాలకు తాగునీరు అందించగలుగుతున్నామో, ఇంకా ఏ ఏ ప్రాంతాలకు తాగునీరు అందించాలని కార్పొరేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళ హల్ చల్

ప్రజాశక్తి- తెనాలి

పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఓ మహిళ హల్ చల్ చేసింది. సేకరించిన వివరాలు ప్రకారం వేమూరు మండలం జంపనికి చెందిన పోతినేని లక్ష్మి సోమవారం సాయంత్రం పురపాలక సంఘ భవనం పైకి ఎక్కి దూకేందుకు యత్నించింది. గమనించిన సిబ్బంది ఆమెకు వారించి, కారణాలను విచారించారు. గ్రామంలో తన రేకుల షెడ్డులు పంచాయతీ అధికారులు తొలగించేందుకు సిద్ధమయ్యారని, అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవట్లేదని అని ఆరోపించింది. మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకొని ఆమెను సబ్ కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. అయితే పనివేళలు ముగిసిన కారణంగా అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆమె తిరిగి వెళ్ళింది. ఇదిలా ఉంటే ఆమె ఉదయం నుంచి కనిపించడం లేదంటూ ఆమె భర్త వేమూరు పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.



సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ పరిశీలన

ప్రజాశక్తి- తెనాలి

పట్టణంలోని 22, 23 వార్డులలోని 26, 27, 28 సచివాలయాలల్లో రికార్డుల నిర్వహణను కమిషనర్ ఎం జస్వంతరావు సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రికార్డుల నిర్వహణ పై సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన అర్జీలు నమోదు, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సందర్శకులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు సందర్శకులకు తెలిసేలా ప్రదర్శించాలన్నారు. వార్డు సచివాలయ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన టిడిపి నాయకులు

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - తాడికొండ

జగనన్న కాలనీ పేరుతో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు.గ్రావెల్ అక్రమ తరలింపును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు.జగనన్న కాలనీ నిర్మాణాలకు గ్రావెల్ అవసరమని ఇటీవల లచ్చన్న గుడిపూడి శివారులో గ్రావెల్ తవ్వుకునేందుకు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి అనుమతులు ఇచ్చారు. అయితే కొందరు వైసీపీ ప్రజా ప్రతినిధులు కాలనీ పేరుతో రాత్రి వేళల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారని టిడిపికి చెందిన కొందరు ఇటీవల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు స్పందించకపోవడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు తహశీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించారు. అవినీతికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .అలాగే లాం గ్రామంలో ఇళ్ల స్థలాల పేరుతో దోపిడీ జరుగుతోందని, స్థలం కనిపిస్తే ఆక్రమించుకుంటున్నారని అదేమని ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారని అన్నారు. గ్రామంలో ఎన్ని ప్లాట్లు ప్రభుత్వం పంపిణీ చేసింది.ఎన్ని ఆక్రమణలకు గురయ్యాయో వివరాలు తెలపాలని రెవెన్యూ అధికారులను కోరారు. లచ్చన్న గుడిపూడి ఫారెస్ట్‌లో జరుగుతున్న అక్రమ తవ్వకాలు,లాం గ్రామంలో ఖాళీ స్థలాల ఆక్రమణ వివరాలను నాలుగు రోజులలో తమకు అందజేయాలని లేకుంటే తామే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. చర్యలు తీసుకోకుంటే స్టేషన్ ముందు ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు.ఈ మేరకు తహశీల్దార్ ఫణీంద్ర బాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల శివరామయ్య, నీలాల కృష్ణారావు, అనూప్, తులసి రామ్, షేక్ అలీ,షేక్ బాబు, నెల్లూరు రాజశేఖర్, సుధీర్,షేక్ సుభాని, అప్జల్ పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం అడ్డగింత

ప్రజాశక్తి-నరసరావుపేట

పట్టణంలో 4వ వార్డులో టిడిపి నియోజకవర్గ భాద్యులు డాక్టర్ చదలవాడ ఆధ్వర్యంలో చేపట్టిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని వైసిపి నాయకులు అడ్డుకున్నారు. వార్డులోని జెండా చెట్టు వద్ద కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించాలని తలపెట్టగా వార్డు వైసీపీ నేత ఖాదర్ బాషా వర్గం అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో టిడిపి వైసిపి కార్యకర్తల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పోలీసుల జోక్యంతో డాక్టర్ చదలవాడ జెండా చెట్టు వద్ద కొబ్బరికాయ కొట్టి కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ ఖాదర్ బాషా వేదింపులు తాళలేక కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రెహామాన్‌కు టిడిపి అండగా ఉంటుందన్నారు. అనంతరం వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.

కరెవరం చెరువులో మృతదేహం



ప్రజాశక్తి-తెనాలి

రూరల్ గ్రామం కరెవరం చెరువులో పురుషుని మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెరువులో మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు విఆర్ఓ, విఆర్ఏలకు సమాచారం ఇచ్చారని, వారు పోలీసులకు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలాన్ని పరిశీలించా మన్నారు. వారి సమక్షంలో మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించగా మృతుడు గుంటూరు అమరావతి రోడ్‌కు చెందిన శ్రీకాంత్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు. మృతుడు మద్యం మత్తులో చెరువులో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు అన్నదానం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని పద్మశాలీయ బజారులోని శ్రీభద్రావతి సమేత భావనారుషి, కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు పద్మశాలీ మహోత్తమ సంఘం, పద్మశాలీ యూత్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 125,443
మిర్చి ఎగుమతి	: 106,811
మిర్చి నిల్వ	: 78,770

మిర్చి ధరలు

	రూపాయలలో
334	7000 -22000
నెం.5	10000 - 20000
273	8500 - 20000
341	8500 - 19500
4884	8000 - 17000
సూపర్-10	15000 - 17200
నాన్ ఎసి	
తేజ	7500 - 19500
బడిగి	7500 - 24500
దేవనూరు డీలక్స్	8000 - 23000
తాలుకాయలు	4500 - 12000

నాయీ బ్రాహ్మణులను చేతి వృత్తిదారులుగానే గుర్తించాలి

ప్రజాశక్తి -తెనాలి:నాయి బ్రాహ్మణ సంఘీయులను చేతి వృత్తి దారులుగానే గుర్తించాలని, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ కు రూ.100 కోట్లు నిధులను కేటాయించాలని టిడిపి క్రమశిక్షణ సంఘం చైర్మన్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని టిడిపి కార్యాలయంలో సోమవారం సంఘీయులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వంలో 2019లో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ కు రూ. 70 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే వైసిపి హయాంలో ఆ నిధులను పూర్తిగా నిలిపివేశారన్నారు. నాయి బ్రాహ్మణులను స్ట్రీట్ వెండర్స్‌గా పరిగణించి, పదివేల ఆర్థిక సాయం అందించడం దారుణమన్నారు. అణచివేతకు గురవుతున్న నాయి బ్రాహ్మణ సంఘీయుల సమస్యలపై త్వరలో విజయవాడ ధర్నా చౌక్‌లో లక్ష మందితో ధర్నా చేసి ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఎండగడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాయి బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు కేటాయి ంచాలని, సంగీత కళాశాలలు నిర్వ హించాలని, నాయి బ్రాహ్మణులను స్ట్రీట్ వెండర్స్ గా కాకుండా చేతి వృతిదారులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కృష్ణ బలిజ పూసల ఫెడరేషన్ మాజీ చైర్మన్ కావేటి సామ్రాజ్యం పలువురు సంఘీయులు పాల్గొన్నారు.

సిఐటియు మండల కార్యదర్శి గృహ నిర్బంధం

ప్రజాశక్తి - చిలకలూరిపేట



కనీస వేతనం రూ.26 వేలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు సోమవారం ఆందోళన చేపట్టిన నేపథ్యంలో సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లును పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. ఆదివారం రాత్రి 11 గంటలకు ఆయన ఇంటికి వెళ్లిన పోలీసులు ఆందోళనలో పాల్గొనేందుకు నరసరావుపేట వెళ్లొద్దని చెప్పి ఆ మేరకు కాగితాలపై రాయించుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కైనా రావాలి లేదా ఇంట్లోనే ఉండాలని మౌకికంగా ఆదేశించారు. దీనిపై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఉద్యమాలను అణచాలని చూస్తోందని, ఇది సరైంది కాదని అన్నారు.



ప్రచారంలో జీవీ ఆంజనేయులు, టిడిపి శ్రేణులు

'మాఫియాలను నడుపుతున్న ఎమ్మెల్యే'

ప్రజాశక్తి-ఈపూరు

వైసిపి పాలనలో ప్రజలు ఉపాధికి దూరమయ్యారని, ఈ ప్రభుత్వానికి ప్రజలు స్వస్తి పలికే రోజులు దగ్గరపడ్డాయని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని కొండ్రముట్ల పంచాయతీ పరిధిలోని దుష్మన్‌పేట తండాలో 'ఇదే ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో సోమవారం నిర్వహించారు. ర్యాలీ అనంతరం జీవి ఆంజనేయులు మాట్లాడుతూ ఇసుక కొరతతో కార్మికులు ఉపాధి కోల్పోయారని, సిమెంట్, స్టీలు ధరలు పెరిగి సామాన్యుడు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి అని చెప్పారు. నిత్యావసరాల ధరలతో సామాన్యుల జీవనం కష్టమైందని, సంక్షేమ పథకాలుంటూ రూ.పది ఇచ్చి పన్నుల రూపంలో రూ.వేలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. పంటలకు మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోయిన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధికారాన్ని అడ్డం పెట్టుకొని అవినీతి, అక్రమాలు, ఇసుక, మట్టి, మద్యం, గుట్కా, భూ దందా లాంటి మాఫియాలను నడుపుతూ రూ.వందల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.జగ్గారావు, వెంకయ్య, బాలయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - అచ్చంపేట

మండలంలోని రోకలిగుంటవారిపాలెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను స్థానిక ఎమ్మెల్యే సతీమణి నంబూరి వసంతకుమారి సోమవారం పంపిణీ చేశారు. గ్రామంలో గంగమ్మ తల్లి తిరుణాలల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆమె పాఠశాలలో విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. ఆమె వెంట వైసిపి నాయకులు నక్క నరసింహారావు, నీలయ్య, ఆనం రామకృష్ణ ఉన్నారు.



పల్నాడు కలెక్టర్ స్పందనకు 212 ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శివశంకర్, జెసి శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

స్పందన కార్యక్రమాలనికి ప్రజల నుండి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాలులో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. అర్జీలను కలెక్టర్‌తోపాటు జెసి ఎ.శ్యాంప్రపసాద్, డిఆర్ఒ వినాయకం స్వీకరించగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 212 మంది అర్జీలను ఇచ్చారు. అర్జీదార్లకు పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. ఇందుకు సహకరించిన వారిని అధికారులు సత్కరించారు.



ఎలుకల మందు తాగుతున్న చిరువ్యాపారి

చిరు వ్యాపారి ఆత్మహత్యాయత్నం

తనకు అన్యాయం జరిగిందని నరసరావుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల షేక్ అబ్దుల్ రహమాన్ అనే చిరు వ్యాపారి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తన షాపును వైసిపి నాయకులు ఐటిసి సుభాని ఖాదర్‌బాషా, కోటిరెడ్డి అక్రమంగా తొలగించారని వాపోయారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద సుమారు 40 ఏళ్లగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మా కుటుంబానికి వైసిపి నాయకులు తీరని అన్యాయం చేశారని, దౌర్జన్యంగా ఖాళీ చేయించిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులతో కలిసి కోరారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని అబ్దుల్ రహమాన్‌ను ఆసుపత్రికి తరలించారు.

ఎస్సీ ధ్రువపత్రం ఇవ్వాలి

బేడ, బుడగ జంగా సామాజిక తరగతికి చెందిన వారికి ఎస్సీలుగా పేర్కొంటూ ధ్రుపత్రాలు మంజూరు చేయాలని సంఘ రాష్ట్ర నాయకులు ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు బేడ బుడగ జంగాలకు ఎస్సీ ధ్రువపత్రం ఇచ్చారని, రాష్ట్ర విభజన తర్వాత తమ ఇవ్వడం లేదని చెప్పారు. దీనివల్ల అనేక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని, పిల్లల చదువులు ఆటంకం కలుగుతోందని చెప్పారు. దీనిపై ఎన్నికలకు ముందు హామీనిచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు విస్మరించారని, దీంతో తమ పిల్లలు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు.

మండుతున్న ఎండుగడ్డి ధర

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పెరిగిన ఎండుగడ్డి, దాణా ధరలతో పాడి పరిశ్రమ కష్టాలను ఎదుర్కొంటోంది. ఒకవైపు వరి సాగు తగ్గగా మరోవైపు సాగు చేసిన పొలాల్లోనూ కోతలకు యంత్రాలను ఉపయోగిస్తుండడంతో ఎండు గడ్డి లభ్యత భారీగా తగ్గింది. దీంతో ఉన్న కొద్దిపాటి గడ్డి ధరలు పెరుగుతున్నాయి. రెండేళ్ల కిందట ఎకరా ఎండు గట్టి రూ.ఏడు వేల వరకు ఉండేది. ఈ ఏడాది అదికాస్త రూ.12-13 వేలకు పెరిగింది. దీనికి కూలి, రవాణా ఖర్చులు సుమారు రూ.3 వేల వరకూ అదనంగా పాడి రైతు భరించాల్సి వస్తోంది. తవుడు, కొబ్బరి చెక్క సైతం 30 శాతం వరకూ ధరలు పెరిగాయి. 50 కిలోల తవుడు రూ.1650, కొబ్బరి చెక్క 25 కిలోలు రూ.1150 వరకూ ధరలున్నాయి. దీంతో పశుపోషణ కష్టంగా ఉంటోందని పాడి రైతులు వాపోతున్నారు.

చిలకలూరిపేట మండలంలో 29 గ్రామాలుండగా ఆరేడు గ్రామాల్లోనే వరి సాగవుతోంది. గతంలో 1500 ఎకరాల సాగుంటే ఇప్పుడుది సుమారు 500 ఎకరాలకే పరిమితమైంది. మండలంలో సుమారు 5 వేల వరకు గేదెలు ఉంటాయని, అంచనా. మురికిపూడి, మానుకొండువారిపాలెం, కావూరు, గోవిందపురం, కమ్మవారిపాలెం, కట్టుబడివారిపాలెంలో పశు పోషణ అధికమే కాక పశుపోషణలో ప్రధానంగా మహిళలే



ఉన్నారు. వ్యవసాయం నిత్యం నష్టాలిస్తుంటే మహిళలు పశుపోషణ ద్వారా కుటుంబ పోషణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.

పశుపోషణలో ప్రధానమైన గడ్డి ధరలు ఏటికేడు పెరిగి పాడి రైతులకు ఆర్థికంగా మోయలేని భారమవుతోంది. ఒక్కో గేదెకు రోజుకు 10 కిలోల ఎండు గడ్డి, 20 కిలోల పచ్చిగడ్డి అవసరం. చిలకలూరిపేట ప్రాంతంలో వరిసాగు తగ్గి ఎండు గడ్డి లభ్యత లేకపోవడంతో నకరికల్లు, నరసరావుపేట, బాపట్ల ప్రాంతాల నుండి ఎండుగడ్డిని కొని తెచ్చుకోవాల్సి వస్తోంది. పచ్చి గడ్డిని ఒక్కో కట్ట రూ.100కు కొనాల్సి వస్తోంది. పచ్చి గడ్డి పెంపకానికి అవసరమైన ఇంగ్లీషు గడ్డి పెంపకానికి ప్రభుత్వ సహకారం ఏ మాత్రమూ అందడం లేదు.

చిలకలూరిపేట సమీపంలో పెదనందిపాడు మార్గం వైపు 20 ఎకరాల్లో మురుగునీరు ఆధారంగా ఇగ్లీషు గడ్డిని సాగు చేస్తున్నారు. ఇందుకు 5 సెంట్లకు రూ.3 వేల వరకూ కౌలు చెల్లిస్తున్నారు. రామచంద్రాపురం, మురికిపూడి గ్రామాల్లోని మరో 10 ఎకరాల్లోనూ బోర్ల కింద ఇంగ్లీషు గడ్డి సాగు చేస్తున్నారు. విడిగా కొనాలంటే పచ్చిగడ్డి కట్ట రూ.100 అవుతోంది. ఇవన్నీ భరించలేని పాడిరైతులు దాణా, గడ్డి ఖర్చులు తగ్గించుకుంటే ఆ ప్రభావం గేదె ఆరోగ్యంతోపాటు పాల దిగుబడిపైనా పడుతోందని పాడి రైతులు వాపోతున్నారు. వీటిపై వివరణ కోసం పశు సంవర్థక శాఖాధికారులను సంప్రదించే ప్రయత్నం చేయగా వారు అందుబాటులోకి రాలేదు.

వ్యవసాయంలో నష్టాలతో పశు పోషణ



రెండెకరాల పొలంలో వ్యవసాయం చేస్తున్నా. ఎప్పుడూ నష్టాలే వస్తున్నాయి. దీంతో పశు పోషణే ఆధారంగా జీవిస్తున్నాం. ఇప్పుడు ఇది కూడా కష్టమవుతోంది. ప్రభుత్వం రాయితీపై దాణా, గడ్డి విత్తనాలు సకాలంలో సరఫరా చేస్తే మాకు కొంచెం ఖర్చులు తగ్గుతాయి. దీనికితోడు గేదెల కొనుగోలుకు వడ్డీలేని రుణాలు, వాటికి బీమా సదుపాయం, పాలకు సరైన ధర కల్పిస్తే మా జీవనోపాధికి ఢోకా ఉండదు.

సాంబిరెడ్డి, పాడిరైతు, మానుకొండువారిపాలెం.

జగన్ ప్రభుత్వ పతనం ప్రారంభం

లోకేశ్‌కు సంఘీభావంగా పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జగన్ ప్రభుత్వ పతనం ప్రారంభమైందని మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు అన్నారు. నారా లోకేశ్ పాదయాత్రకు సంఘీభావంగా వైవి ఆంజనేయులు సోమవారం చేపట్టిన పాదయాత్ర సత్తెనపల్లి మండలం ధూళ్లిపాళ్లలో ప్రారంభమైంది. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి వైవి ఆంజనేయులు పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన పాదయాత్ర ముప్పాళ్ల మండలం తొండపి మీదుగా నకరికల్లు మండలం నరసింగపాడుకు చేరింది. పాదయాత్రకు మహిళలు, టిడిపి శ్రేణులు పలుచోట్ల ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైవి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజల్ని ఉద్ధరిస్తానంటూ ఎన్నికల్లో ఓట్లేయించుకున్న జగన్‌మోహన్‌రెడ్డి గెలిచాక ఎడాపెడా పన్నులు వడ్డిస్తున్నారని అన్నారు. మూడున్నరేళ్ల పాలనలో ఒక్క కంపెనీనైనా తెచ్చారా? జాబ్ కేలండర్



వైవి ఆంజనేయులుకు హారతి ఇస్తున్న మహిళలు

ప్రకటించారా? అని ప్రశ్నించారు. ఉన్న కంపెనీలు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాని, ధరలు ఆకాశాన్నంటుతున్నారని విమర్శించారు. రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోని సిఎం తాడేపల్లికే పరిమితమయ్యారని అన్నారు. అయితే లోకేశ్ మాత్రం ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తుండగా ప్రభుత్వం, పోలీసులు ఆటంకాలు కల్పిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడుకునేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. పాదయాత్ర సందర్భంలో వైవి ఆంజనేయులు ధూళ్లిపాళ్ల, తొండపి గ్రామాల్లో వ్యవసాయ కూలీలు, రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం చాగల్లు మీదుగా, కండ్లకుంటకు పాదయాత్ర చేరింది. ఎస్సీ కాలనీలోని చర్చి కాంపౌండ్‌లో వైవి ఆంజనేయులు రాత్రి బస చేశారు. కార్యక్రమంలో వైవి ఆంజనేయులు కుమారుడు సుజిత్‌కుమార్, టిడిపి నాయకులు సిహెచ్.శ్రీనివాసరావు, బి.వందనాదేవి, ఎ.సాంబయ్య, బి.నాగేశ్వరరావు, దేవేంద్రరావు, చంద్రశేఖర్, యల్లమంద, జి.నరేంద్ర, బి.వెంకటస్వామి, బి.తిరుపతిరావు, ఎల్.సూరిబాబు, ఆర్.అప్పారావు, ఆర్.శ్రీను, ఎన్.రాములు, ఆర్.కోటయ్య, ఒ.గురవయ్య, వి.బ్రహ్మయ్య, బి.సామీయేలు, సిహెచ్.కుటుంబరావు, ఒ.ఆంజనేయులు పాల్గొన్నారు

స్పందనకు 143 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జెసి రాజకుమారి

ప్రజాశక్తి-గుంటూరు

స్పందన అర్జీలు, ముఖ్యంగా రెవెన్యూ పిటీషన్లు పరిశీలించటానికి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపే అధికారులపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని, ఎస్.ఎస్.శంకరన్ హాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి, డిఆర్‌ఒ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకటశివరామిరెడ్డి ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, సంబంధిత శాఖలకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ స్పందనలో మొత్తం 143 మంది అర్జీలు అందచేశారు. కార్యక్రమంలో మెప్మా పీడీ వెంకట నారాయణ, హౌసింగ్ పీడీ సాయినాధ కుమార్, డిపిఒ కేశవరెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ డిడి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

బతికుంటే.. చనిపోయినట్లు నమోదు చేశారు



తన కుమార్తె పేరును రేషన్ కార్డులో జత చేయాలని దరఖాస్తు చేసుకుంటే, ఆమె చనిపోయినట్లుగా సచివాలయంలో నమోదు చేశారని, గుంటూరు, కెవిపి కాలనీకి చెందిన డి.భూలక్ష్మి స్పందనలో అర్జీ అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త చనిపోవటంతో అతని పేరుతో తొలగించి, తన కుమార్తె అపరంజి పేరు జత చేయాలని సంవత్సరం క్రితం 76వ వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నానని, అయితే తన కుమార్తె చనిపోయినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారని తెలిపారు. అప్పటి నుండి అధికారుల చుట్టూ తిరుగుతూ తన కుమార్తె బతికే ఉందని చెబుతున్నా ఎవరూ పట్టించుకోవట్లే దన్నారు. పుట్టుకతోనే వైకల్యంతో బాధపడుతున్న తన కుమార్తె చికిత్సకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందనుకుంటే, అధికారుల నిర్లక్ష్యం వల్ల అది కూడా నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, తనకు న్యాయం చేయాలని కోరారు.

అంబేద్కర్ భవన్ నిర్మాణం ప్రారంభించాలి

ఏసీ కాలేజి ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవనం నిర్మాణం పున:ప్రారంభించాలని కోరుతూ వివిధ దళిత, ప్రజా సంఘాల నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో అర్జీ అందచేశారు. గత కొంత కాలంగా అంబేద్కర్ భవనం నిరుపయోగంగా ఉండటంతో సంఘాలు సమావేశాలు నిర్వహించుకోవటానికి ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. కావున తక్షణమే నిధులు మంజూరు చేసి, నిర్మాణం పున:ప్రారంభించి, వినియోగంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్, బీమ్‌సేన సేవా దళ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.నీలాంబరం, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.జె.విద్యాసాగర్, దళిత, బహుజన పరివర్తన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె.శ్రీకాంత్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు తదితరులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్స్‌లో బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

ఏపీ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న అటెండర్లు, వాచ్‌మెన్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మోడల్ స్కూల్స్ ఔట్‌సోర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్య క్షులు వినుకొండ పేరయ్య కోరారు. ఈ మేరకు ఆయన స్పందనలో అర్జీ అందచేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షం లో ఉన్నప్పుడు పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో నుంచి కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని కోరారు. మినిమయం టైమ్ స్కేల్ ఇవ్వాలని, బోధనేతర సిబ్బందికి రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని వాచ్‌మెన్లకు, నైట్ వాచ్‌మెన్లకు వారాంతపు సెలవు, పండుగ సెలవులు ఇవ్వాలని కోరారు.

కేంద్ర బడ్జెట్ చేనేతకు మరణ శాసనం

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌లో చేనేత రంగానికి కేవలం 200 కోట్లు కేటాయించడం చేనేతకు మరణ శాసనం అని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం గుంటూరు జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు డోకుపర్తి రామారావు, కౌతరపు వెంకటేశ్వరరావు, చిట్టేల సీతారామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్షల కోట్ల బడ్జెట్ లో చేనేతకి కేవలం 200 కోట్లు, టెక్స్ టైల్ రంగానికి 5,300 కోట్లు కేటాయించడం చూస్తుంటే, వ్యవసాయం తరువాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే రంగం చేనేత రంగం అలాంటి రెండవ ప్రాధాన్యత కలిగిన రంగాన్ని నేటి పాలకుల చేనేత వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాల వలన చేనేత పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుందిని పేర్కొన్నారు. నేటికీ దేశవ్యాప్తంగా 34 లక్షల మగ్గాలు పనిచేస్తున్నాయని ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయి దీనిపై ఆధారపడిన ఉప వత్తుల వారు మరో 40 లక్షల మంది వరకు ఉన్నారు వారి జీవనోపాధికి చర్యలు తీసుకోవాల్సిన పాలక వర్గాలు కార్పొరేట్ అనుకూల విధానాలను తీసుకొని చేనేత గొంతు నులుపుతున్నారు విమర్శించారు. 2014 కి ముందు బిజెపి ఎన్నికల ప్రచారంలో మేము అధికారానికి వస్తే చేనేత పరిశ్రమకు సంవత్సరానికి 5000 కోట్లు కేటాయిస్తామని ప్రగడ్బాలు పలికారు కానీ 2014 అధికారానికి వచ్చిన నాటి నుండి నేటివరకు పదిసార్లు ప్రవేశపెట్టిన కేంద్రం బడ్జెట్లో 5000 కోట్లు కూడా కేటాయించలేక పోయింది తెలిపారు. ఒకవైపున చేనేత వస్త్రాలపై ఐదు శాతం జీఎస్టీ పన్ను వెయ్యడం నూలు,రంగులు, రసాయనాలపై జిఎస్టి వేయటం తో నూటికి40% దాకా ధరలు పెరిగాయి, చేనేతకు కేటాయించిన 11 రకాల వస్త్రాలు పవర్లూమ్ మగ్గాలపై తయారవు తున్నాయి అన్నారుు. వీటిని అరికట్టడానికి చర్యలు తీసుకోకపోగా పవర్ లూమ్ యజమానులను ప్రోత్సహించే విధంగా బడ్జెట్ కేటాయిస్తున్న ఈ బిజెపి ప్రభుత్వ విధానాలపై చేనేత కార్మికులు సమరశీల పోరాటాల ద్వారానే చేనేత కార్మికుల హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

ప్రజల నుండి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం జీఎంసి కాన్ఫరెన్స్ హాల్లో స్పందన, సచివాలయ కార్యదర్శులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. కమిషనర్ తొలుత సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతూ జాబ్‌చార్ట్ ప్రకారం ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలన్నారు. సమావేశం అనంతరం గతవారం స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. తర్వాత ప్రజల నుండి అర్జీలు స్వీకరించగా మొత్తం 56 పిర్యాదులు అందాయి. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 16, ఇంజినీరింగ్ విభాగం 19, ప్రజారోగ్య విభాగం 6, రెవెన్యూ విభాగం 4, ఉపా సెల్ విభాగంకి సంబధించి 4, అకౌంట్స్ విభాగం సంబంధించి 7 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్.ఈ. భాస్కర్, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, సి.ఎం.ఓ.హెచ్. డాక్టర్ విజయలక్ష్మీ, ఎం.హెచ్.ఓ. డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అదానిపై సిబిఐ విచారణ చేయండి

బ్యాంకుల ఎదుట కాంగ్రెస్ ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం బ్యాంకుల వద్ద నిరసన తెలిపారు. స్థానిక హిందూ కళాశాల వద్ద బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదుట దర్నా నిర్వహించారు. ఎఐసిసి కార్యదర్శి ఉషా రాణి, జిల్లా అధ్యక్షులు లింగం శెట్టి ఈశ్వర రావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్ పాల్గొన్నారు. జాతీయ బ్యాంకు ల లో దాచుకున్న ప్రజల సొమ్మును కాపాడాలని కోరుతూ తక్షణమే అదాని ఆస్తులను జప్తు చేసి ఆయనను అరెస్టు చేయాలని కోరుతూ దినంతటిని ప్రేరెపించిన నరేంద్రమోడీ,అదాని పై సిబిఐ విచారణ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం పాల్ విజయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు అంబటి రత్తయ్య, వేంకటరెడ్డీ, యూత్ కాంగ్రెస్ నాయకులు గాలి అశోక్,కార్యదర్శి షేక్ అహ్మద్ బాషా, నగర ఉపాధ్యక్షులు చెన్నంశెట్టి సాంబయ్య, సయ్యద్ జాని గోల్డ్, యన్ యస్ యుఐ అధ్యక్షులు షేక్ కరిమ, నగర కార్యదర్శిలు సయ్యద్ సుబాని పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : ఎఐసిసి పిలుపు మేరకు మంగళగిరి ఎస్‌బిఐ ఎదుట కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ షేక్ సలీం మాట్లాడుతు బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను వాటి ఆస్తులను ఆర్థికంగా దివాలా తీసే విధంగా బడా వ్యాపారవేత్తలకు వత్తాసు పలుకుతూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారన్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్సి సెల్ నియోజకవర్గ నాయకులు జీవన్ సాగర్, నాయకులు గోలి సాంబశివరావు, కుప్పాల శ్రీరామ్ మూర్తి, చౌదరి, సుభాని తదితరులు పాల్గొన్నారు.



గుంటూరులో



పవర్ లిఫ్టర్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

పవర్ లిఫ్టర్లకు సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి :ఈనెల 2, 3 తేదీలలో కృష్ణాజిల్లా జగ్గయ్యపేట పట్టణంలో జరిగిన అండర్ 17, అండర్ 19 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మంగళగిరి పిట్ జోన్‌కు చెందిన ఐదుగురు పతకాలు సాధించారు. సోమవారం సికే హైస్కూల్ ఆవరణలో విజేతలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అభినందించారు. కార్యక్రమంలో షేక్ సంధాని, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి పుల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎం పకీరయ్య

అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ఆత్మకూరులో సచివాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆత్మకూరులో అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు, పోరంబోకు స్థలాల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు మొసలి పకీరయ్య డిమాండ్ చేశారు. సోమవారం

సిపిఎం సర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆత్మకూరు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో పకీరయ్య మాట్లాడుతు ఆత్మకూరు జగనన్న కాలనీలో సర్వే చేసిన సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు అనేక సమస్యలు వారి దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. తాడేపల్లి లోని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నివాసం ప్రాంతంలో భద్రత దృష్ట్యా 250 కుటుంబాల ఇళ్లను తొలగించి వారికి ఆత్మకూరులో పది ఎకరాల సాగుభూమిలో ప్లాట్లు వేసి రెండు సెంట్లు చొప్పున 2020లో కేటాయించారన్నారు. ఆ స్థలాలలో అప్పులు చేసి నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కనీస మౌలిక వసతులు కూడా ప్రభుత్వం కల్పించలేదని, ఏవిధంగా జీవిస్తారని ఆయన ప్రశ్నించారు. అపారిశుధ్యంతో దోమలు పెరిగి అంటువ్యాధులు, అనారోగ్యం పాలవుతున్నారన్నారు. అన్ని సదుపాయాలున్న తాడేపల్లి ప్రాంతం నుండి వారిని తీసుకువచ్చి ఎక్కడో మారుమూల అడవుల్లో పడేసిన మాదిరిగా మమ్మలను వదిలేశారని వాపోయారు. సమస్యలమీద సోమవారం సచివాలయంలో మెమొరండం ఇవ్వడానికి రమ్మన్న నేపథ్యంలో అక్కడ ప్రజలు మీరు సర్వే చేసి వెళ్లిన స్థానిక వైసిపి గుండాలు మమ్మల్ని బెదిరిస్తున్నారని అందువల్ల మేము వచ్చి అర్జీ ఇవ్వలేమని వాపోయారు. శాఖ కార్యదర్శి వుద్దంటి దుర్గారావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కోతలు పెడుతున్న నేపథ్యంలో గ్రామంలో కూడా అనేకమంది పేదల పథకాలు తొలగించారని వారిని సమగ్ర విచారణ జరిపి వారికి కూడా తప్పనిసరిగా పథకాలు అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో భవిష్యత్తులో ప్రజలను,వివిధ రాజకీయ, ప్రజాసంఘాలను కలుపుకొని పై సమస్యలు పరిష్కారానికై పోరాడతామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పండల ప్రసాదు,చిట్టేల సీతారామాంజనేయులు, వెంగళ రామారావు, దేపూరు పద్మనాభశర్మ, కటివరపు శేషయ్య, ఆనందం బాబ్జి, పులివర్తి ప్రసాదు, కాంద్రు ఆంజనేయులు, చింతలచెరువు జాను, వల్లభాపురపు సాంబశివరావు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోరంట్ల ఫకీరమ్మ,పులివర్తి శామ్యూల్,మహిళా సంఘం నాయకురాలు గౌరభత్తుల లక్ష్మి కార్యకర్తలు గ్రామం ప్రజలు పాల్గొన్నారు.



శ్రేణులతో మంత్రి రజిని సమావేశం

ప్రజాశక్తి - నాదెండ్ల

'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అప్పాపురం, ఎండుగుంపాలెం, అమీన్‌సాహెబ్‌పాలెం, ఇర్లపాడు, సాతులూరు, నాదెండ్ల, కనపరు గ్రామ సచివాలయాల పరిధిలోని గృహసారధులు, వాలంటీర్లు, సచివాలయాల కన్వినర్ల సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని మాట్లాడారు.



క్రమశిక్షణా చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - పెదకూరపాడు

పార్టీలో ఉంటూ పార్టీ ప్రతిష్టను దిగజార్చే విధంగా ప్రవర్తిస్తున్న వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులను ఆ పార్టీ పెదకూరపాడు నాయకులు కోరారు. ఈ మేరకు ఆయన్ను కలిసిన వారిలో టిడిపి మండల అధ్యక్షులు ఎ.రమేష్, నాయకులు సాగర్, ముంతాజ్, అజిముల్లా, కృష్ణకుమారి, మల్లి, కోటి పాల్గొన్నారు.

8న మండలపరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - రొంపిచర్ల

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపిడిఒ కె.మ్యాథ్యూబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నెలకొన్న సమస్యలు, సంక్షేమ పథకాలు అమలపై సమావేశంలో సమీక్షిస్తామని పేర్కొన్నారు. అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరవ్వాలని కోరారు.

బిపి మండల్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ప్రజాశక్తి - అచ్చంపేట

సామాజిక న్యాయం కోసం పాటుపడిన బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘ మండల అధ్యక్షులు సాతల శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు పత్రాలను మండల కేంద్రమైన అచ్చంపేట పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. బీసీల కోసం, వారి న్యాయమైన హక్కుల కోసం పోరాడిన వ్యక్తి బీపీ మండల్ అన్నారు. ఆయన స్ఫూర్తిగా గుంటూరులో చేస్తున్న విగ్రహావిష్కరణకు బీసీలంతా తరలి రావాలన్నారు. సమావేశంలో బీసీ సంఘ నాయకులు డి.తిరుపతిరావు, ఎం.శ్రీను, మాజీ జెడ్‌పిటిసి ఎన్.వెంకటేశ్వర్లు, టి.ఆంజనేయులు, ఏడుకొండలు, కృష్ణమ్మ, పి.తిరుపతిస్వామి, నీలకంఠేశ్వరరావు పాల్గొన్నారు.



బంధువులు, కుటుంబీకుల నుండే సమస్యలు

కోడలు, ఆమె ప్రియుని నుండి మనవరాలికి ప్రాణహాని

తన కోడలు, ఆమె ప్రియుడి నుండి మనవరాలికి ప్రాణహాని ఉందని వినుకొండ మండలం నాగిరెడ్డిపల్లెకు చెందిన మాచర్ల మోహన్‌రావు ఫిర్యాదు చేశారు. తన పెద్దకుమారుడు సుధీర్‌కుమార్‌కు తన చెల్లెలు కుమార్తె మేరి సుచరితకు 18 ఏళ్ల కిందట వివాహైందని, వారికి ఒకబ్బాయి, ఒకమ్మాయి ఉన్నారని తెలిపారు. అయితే తన కుమారుడు చనిపోయాడని, కోడలు నరసరావుపేటలో తపాలా కార్యాలయంలో ఉద్యోగం చేస్తుందని, ఆమె బాపట్ల జిల్లా అద్దంకి మండలం శంకరాపురానికి చెందిన అనపర్తి మహేంద్రతో వివాహేతర సంబంధం పెట్టుకుందని తెలిపారు. తన మనవరాలిపై మహేంద్ర పలుమార్లు అత్యాచారం చేశాడని, ఈ విషయాన్ని మేరి సుచరితకు చెప్పినా పట్టించుకోపోగా అతనిపక్షానే మాట్లాడుతూ మనవరాలిని కొడుతోందని, దీనిపై తాము నరసరావుపేట ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. తన కుమారుని మరణంపైనా అనుమానం ఉందని చెప్పాడు.

చెల్లెలే మోసం చేసింది



తన చెల్లెలు లక్ష్మీసుశీల కుమార్తె అయిన లక్ష్మీప్రియ ఉన్నత చదువుల కోసం, ఆమె విదేశాలకు వెళ్లడానికి లోను కోసమని తన ఇంటిని ఏడేళ్ల కిందట రిజిస్ట్రేషన్ చేశామని, ఆమె ఆస్ట్రేలియాలో స్థిరపడిందని అయినా తన ఇంటిని తనకు రిజిస్టర్ చేయడం లేదని నరసరావుపేటలోని ఎన్‌జిఒ కాలనీకి చెందిన పామిశెట్టి విజయకుమారి ఫిర్యాదు చేశారు. దీనిపై తాను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని, పైగా చెల్లెలు మరిది వచ్చి దుర్భాషలాడి దాడి చేశారని వాపోయారు.

స్థలాన్ని కబ్జా చేసిన హోం గార్డు



చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న రమేష్ తన ఇంటి ప్రాంగణంలోని స్థలాన్ని కబ్జా చేశాడని

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో అదనపు ఎస్పీ జి.బిందుమాధవ్ పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 93 ఫిర్యాదులు అందగా వాటి పరిష్కారానికి అధికారులను ఎఎస్‌పి ఆదేశించారు. డీఎస్పీలు విజయభాస్కర్‌రావు, జయరాం ప్రసాద్, రవిచంద్ర, ఆదినారాయణ, సిఐ సుభాషిణి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నరసరావుపేట



అర్జిదార్ల నుండి సమస్యలు వింటున్న ఎఎస్‌పి బిందుమాధవ్

చిలకలూరిపేట తూర్పుమాలపల్లికి చెందిన వడ్లాడ నాగేంద్రమ్మ అనే వృద్ధురాలు ఫిర్యాదు చేశారు. దీనిపై తాను ప్రశ్నిస్తే పొరాపాటైందని ఒకసారి, డబ్బులిస్తానని మరోసారి చెప్పాడని, ఇప్పుడు ఇప్పుడు ఖాళీ చేయను.. ఏం చేసుకుంటావో చేసుకో.. అని బెదిరిస్తున్నాడని వాపోయారు.



కూరపాటి రోశమ్మ ఫిర్యాదు చేశారు. ఆ భూమిని మరిది గతంలో కౌలుకు సాగు చేసుకునేవాడని, ఇటీవల తన భర్త మృతితో కౌలుకూడా ఇవ్వకుండా దౌర్జన్యం చేస్తున్నాడని, ప్రశ్నిస్తే దాడి చేశారని వాపోయారు.



భార్య, కుమార్తె ఆచూకీ కనిపెట్టండి

తన భార్యకు మరోవ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని, వారిద్దరూ కలిసి తన కుమార్తెను తీసుకుని వెళ్లిపోయారని వినుకొండ మండలం చాట్రగడ్డపాడుకు చెందిన గుర్రం గురవయ్య ఫిర్యాదు చేశారు. వీరు నరసరావుపేట ప్రాంతంలో నివాసం ఉంటున్నారని తెలిసిందని, తల్లి, చెల్లి కోసం కుమారుడు దిగులు పెట్టుకున్నాడని, వారి ఆచూకిని కనిపెట్టి తమ వద్దకు చేర్చాలని కోరారు. దీనిపై పోలీసులకు ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వెలిబుచ్చారు.

ప్రభుత్వ స్థలాన్ని విక్రయించి మోసం



తనను మోసం చేసి ప్రభుత్వ భూమిని విక్రయించారని వినుకొండ పట్టణానికి చెందిన పొల్లా నరసయ్య ఫిర్యాదు చేశారు. తన స్నేహితు వలపర్ల సుబ్బయ్య ద్వారా మక్కెన శ్రీనుకు చెందిన వినుకొండ మండలం విఠంరాజుపల్లిలో 3 సెంట్ల స్థలాన్ని ఏడేళ్ల కిందట రూ.1.46 లక్షలకు కొన్నానని, రిజిస్ట్రేషన్ కూడా చేయించానని తెలిపారు. అయితే అది ప్రభుత్వ స్థలమని తెలిసిందని, డబ్బు తిరిగివ్వాలని అడుగుతుంటే ఇవ్వడం లేదని తెలిపారు. బిఎస్‌ఎన్‌ఎల్‌లో పని చేస్తూ రిటైరైన డబ్బుతో ఆ స్థలాన్ని కొన్నానని, వృద్ధాప్యంలో ఉన్న తమకు ఇప్పుడు డబ్బు చాలా అవసరమని ఆవేదనకు గురయ్యారు.

పొలాన్ని మరిది కాజేశాడు

తన భర్త ద్వారా తమకు రావాల్సిన నాదెండ్ల మండలం చందారంలో అరెకరం పొలానికి తన మరిది రాజు నకిలీ పత్రాలు సృష్టించి కాజేశాడని ఫిరంగిపురం మండలం పొనుగుపాడుకు చెందిన

ఆస్తిని కాజేసిన కుమారులు ఓ గదిలో పెట్టారు

ఆస్తిని, ఇంటిని తమ పేరున రాయించుకున్న ఇద్దరు కుమారులు తన పోషణ భారంగా భావించి గుంటూరులో



ఒక చిన్న అద్దె గదిలో ఉంచి పట్టించుకోవడం లేదని సత్తెనపల్లి మండలం పెద మక్కెనకు చెందిన దొంతిరెడ్డి వెంకటరావమ్మ ఫిర్యాదు చేశారు. పెద్ద కొడుకు వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌లో స్థిరపడగా చిన్న కుమారుడు గుంటూరు సమీపంలో దాసరిపాలెంలో ఉంటున్నాడని తెలిపారు. తన భర్త పెద్ద కొడుకు వద్ద ఉంటూ 2021లో చనిపోతే చివరి చూపు కూడా చూడనివ్వలేదని, వృద్ధాప్యంలో ఉన్న తనను కొడుకులు, మనవళ్ల వద్ద జీవించే ఏర్పాటు చేయాలని కోరారు.



ధాన్యం కొని రూ.30 లక్షల ఎగనామం

తమ వద్ద 6 లారీల ధాన్యం కొనుగోలు చేసిన క్రోసూరు మండలం చట్టుబోడు తండాకు చెందిన బాజీనాయక్ రూ.30 లక్షలు డబ్బులు ఇవ్వడం లేదని దొడ్లేరుకు చెందిన 18 మంది రైతులు ఫిర్యాదు చేశారు. డబ్బుల కోసం వ్యాపారి ఇంటికెళ్లి అడిగితే మిల్లర్ ఐపి పెట్టాడు.. మేమేమీ చేయలేం.. అంటూ అతని భార్య చెబుతోందని, క్రోసూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా సరిగా పట్టించుకోవడం లేదని వాపోయారు.

దీనిపై కౌలురైతు సంఘం క్రోసూరు మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ ధాన్యం అమ్మిన డబ్బులను మిల్లర్ వద్ద ధాన్యం వ్యాపారి బాణావత్ బాలాజీ నాయక్ తీసుకున్నాడని, కానీ అ డబ్బును రైతులకు ఇవ్వలేదని చెప్పారు. అతనికి పంట అమ్మిన బాధితుల్లో ధాన్యంతోపాటు మిర్చి, పత్తి రైతులూ ఉన్నారని తెలిపారు. బాలాజీనాయక్ రైతులను ఉద్దేశపూర్వకంగానే మోసం చేసినట్లు తమ పరిశీలనలో తేలిందని, అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయాలని, సొత్తును రైతులకు ఇప్పించాలని కోరారు. లేకుంటే ఆందోళన చేస్తామని చెప్పారు. బాధిత రైతుల్లో ఎక్కువమంది కౌలురైతులే ఉన్నారన్నారు.

టిడ్కో ఇళ్ల కోసం కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జగనన్న కాలనీల్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, నిర్మాణ సామగ్రి ఇవ్వాలని డిమాండ్

టిడ్కో ఇళ్లను లబ్ధిదార్లకు సత్వరమే అందజేయాలని, జగన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం దర్నా చేశారు. తొలుత జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని గాంధీ పార్కు వద్ద నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. లోపలికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించకుండా గేటు మూసివేశారు. అర్జీలు ఇచ్చేందుకు కొంతమందిని మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. దీంతో అక్కడే ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాసమస్యలను విన్నవించడానికి ఏర్పాటు చేసిన స్పందనకు వెళ్తున్న పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం పోలీసులు అడ్డుపెట్టుకొని ఇలా వ్యవహరించడం చట్ట విరుద్ధమని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 5.50 లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయి సిద్ధంగా ఉన్నాయని, వాటికి మౌలిక వసతులు కల్పించాల్సిన ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. జగన్న కాలనీల్లో గృహ నిర్మాణానికి ప్రస్తుతం ఇస్తున్న మొత్తం ఏ మాత్రమూ చాలదని, అవసరమైతే ప్రభుత్వమే ఇల్లు కట్టి ఇస్తుందనే ముఖ్యమంత్రి వాగ్దానం ఏమైందని నిలదీశారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలతోపాటు సిమెంటు, ఇసుక, ఇనుము ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, నాయకులు కె.రాంబాబు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

చలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివ శంకరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి: ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా, రైతాంగ హక్కులకై ఏప్రిల్ 5న జరిగే చలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు కోరారు. సోమవారం రాత్రి కాజ వెంకటేశ్వరరావు అధ్యక్షతన తాడేపల్లి ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. 5న చలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి బుధవారం తాడేపల్లిలో సదస్సు నిర్వహించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ మతోన్మాద నియంతృత్వ బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పకపోతే ఈ దేశ ప్రజా సంపద అంతా ఆదానీ, అంబానీల చేతుల్లోకి వెళు తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 5న దేశ రాజధాని డిల్లీలో లక్షలాది మందితో జరిగే కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.20 వేలు, పెన్షన్ రూ.10 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు పద్ధతి ఎత్తివేసి పర్మినెంట్ ఉద్యోగాల విధానం అమలు చేయాలని కోరారు. సైన్యంలో ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని కోరారు. ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ కార్యకర్తలను సైన్యంలోకి రిక్రూట్‌మెంట్ చేసుకోవడానికే ఈ పథకాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. వ్యవసాయ ఉత్పతులు అన్నింటికీ కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం మీద ఆధారపడిన పేద, మధ్యతరగతి రైతులు, వ్యవసాయ కార్మికులు అందరికీ రుణమాఫీ అమలు చేయాలని కోరారు. 60 ఏళ్లు నిండిన వారందరికీ పింఛను మంజూరు చేయాలని కోరారు. కార్మికులకు శాసనంగా మారిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పెనుభారంగా మారిన విద్యుత్ సవరణ చట్టం 2022ను రద్దు చేయాలని కోరారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవడంతో పాటు కడప ఉక్కును వెంటనే ప్రారంభించాలని కోరారు. 200 రోజులు ఉపాధి మామీ పనులు కల్పించడంతో పాటు రోజు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన మేరకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు, హమాలీ, ఆటో, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు తదితర అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. వీటితో పాటు మొత్తం 21 డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న చలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి బుధవారం జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోటా బాబురావు, సిఐటియు పట్టణ నాయకులు కొట్టె కరుణాకరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి కాజ వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు పల్లె కృష్ణ, సంసోన్‌లు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎండి ఖాసీం

ఉర్దూ భోదన తప్పనిసరి

ప్రజాశక్తి -దుగ్గిరాల

పాఠ్య ప్రణాళికలను రూపొందించుకొని ఉర్దూ పాఠశాలలో తప్పనిసరిగా ఉర్దూ బోధించాలని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండి ఖాసీం అన్నారు. మండలంలోని పెనుమూలి, చిలువూరు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రకరకాల ప్రశ్నలు వేసి ప్రతిభను పరిశీలించారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాలను పరిశీలించి వారికి తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం రికార్డులనూ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గయాసుద్దవుల షేక్ బాజ్జి రిజ్వాన బేగం రుక్సన విష్ణు వందన తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ కౌలు చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వినతి



ఎమ్మెల్సీ మాణిక్య వరప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న అసైన్డ్ రైతులు

ప్రజాశక్తి - తుళ్లూరు

కౌలు చెల్లించేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని రాజధాని ప్రాంతం అసైన్డ్ రైతులు ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్‌కు వినితి పత్రం అందించారు. సోమవారం వెంకటపాలెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంకు వచ్చిన మాణిక్య వరప్రసాద్‌ను వెంకటపాలెంకు చెందిన పులి ప్రభుదాస్ మరికొందరు రైతులు ఎమ్మెల్సీ ముందు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణం నిలిచిపోవడంతో అసైన్డ్ రైతులైన దళితులు, ఇతర వర్గాల ప్రజలు వ్యవసాయ పనులు లేక, ఉపాధి లేక కుటుంబాలు గడవని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. విచారణ పేరుతో తాళ్లాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, మందడం తదితర గ్రామాల రైతులకు మూడేళ్ల కౌలు చెల్లించకుండా కాలయాపన చేయడం సబబు కాదన్నారు. తమ భూములపై ఎలాంటి అవకతవకలు జరగలేదని, విచారణ పేరుతో కౌలు చెల్లించకపోవడం దారుణ మన్నారు. ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు స్పందించి సత్వరమే కౌలు చెల్లించేలా కృషి చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

సిఆర్‌డిఎ కార్యాలయంలో..

విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయంలోనూ అసైన్డ్ రైతులు కౌలు చెల్లించాలని సోమవారం వినతిపత్రం అందజేశారు. గత నెలలో రెండు సార్లు కార్యాలయంకు వచ్చి వినతిపత్రం ఇచ్చామని అయినా అధికారులు, ప్రభుత్వం స్పందించలేదని తుళ్లూరు, అనంతవరం తదితర గ్రామాలకు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కౌలు చెల్లించాలంటూ కార్యాలయం ముందు నినాదాలు చేశారు.

వ్యవసాయ పరికరాలను అందుబాటులో ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-మంగళగిరి

రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పరికాలను అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మంగళగిరి మార్కెట్ యార్డ్ కమిటీ సమావేశం చైర్ పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అవసరమైన తైవాన్స్ స్ప్రేర్లు, తార్పాలెం పట్టాలను ఉపయోగించుకునేందుకు తదితర వ్యవసాయ పరికారాలు అందుబాటులో ఉంచాలని కోరారు. మార్కెట్ యార్డ్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసే చర్యలను చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమావేశం అనంతరం ప్రభుత్వం మంగళగిరికి జిల్లా అదనపు కోర్టు మంజూరు చేయటానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని సోమవారం మంగళగిరి బార్ అసోసియేషన్ న్యాయవాదులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బార్ సోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు దొడ్డక బ్రహ్మానందరావు, నరసింహారావు, సీనియర్ న్యాయవాదులు సింగంశెట్టి రామచంద్రరావు, గుజ్జర్లపూడి జాన్ బాబు, న్యాయవాదులు లెనిన్ బాబు రేటూరి కిషోర్, రంగశెట్టి లక్ష్మి, క్రోసూరి చంద్రశేఖర్, బొర్రా మధు, కొడాలి శేఖర్, బుల్లా విజయరాఘవ, కంచర్ల ప్రకాశరావు తదితరులు కృతజ్ఞతలు తెలిపిన వారిలో ఉన్నారు.

చేనేత మగ్గాల షెడ్ల నిర్మాణ పనులు పరిశీలన

పట్టణంలో రాజీవ్ గృహకల్పలో రూ. 2.39 కోట్లతో నిర్మిస్తున్న చేనేత మగ్గాల షెడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పరిశీలించారు పనులు త్వరగా పూర్తిచేసి చేనేత కార్మికులకు అందజేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అదేవిధంగా పాత బస్టాండ్ సెంటర్లో నిర్మాణం జరుగుతున్న చేనేత భవనం పరిశీలించారు.

విద్యతోనే సమాజం అభివృద్ధి

విద్యతోనే సమాజం అభివృద్ధి అవుతుందని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మంగళగిరి పట్టణంలో గల సికె హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి విద్యాసంస్థల అధ్యక్షులు సి.కే కనకయ్య అధ్యక్ష వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, విద్యాసంస్థల ప్రతినిధులు జే పాండురంగారావు, దామర్ల కుబేర స్వామి, ఆడిటర్ డివి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



జీవామృతం తయారిని చూపిస్తున్న పిఆర్‌పి మహేష్

జీవామృతం తయారీపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

జీవామృతం తయారీ పై అవగాహన కార్యక్రమం సోమవారం మండల పరిదిలోని గొట్టిపాడు రైతు భరోసా కేంద్రం పిఆర్‌పి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పిఆర్‌పి మహేష్ మాట్లాడుతూ జీవామృతం వాళ్ళ కలిగే లాభాలను గురించి వివరించారు. దీని ద్వారా సూక్ష్మ పోషకాలు అబివృద్ధి చెందుతాయని తద్వారా నేల సారవంతం అవుతుందని అన్నారు. 200 లీటర్ల జీవామృతం తయారీకి10 కేజీల ఆవు పేడ, 10 లీటర్ల ఆవు మూత్రం, 2 కేజీల బెల్లం, 2 కేజీల పప్పుల పిండి, తగినంత పుట్టమట్టి తీసుకుని జీవామృతం తయారు చేసుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పి సుబ్బారావు, రైతులు అంచా హనుమంతు తదితరులు పాల్గొన్నారు



ఆంజనేయశర్మను సత్కరిస్తున్న థియేటర్ కమిటీ సభ్యులు

కళాకారుడు ఆంజనేయశర్మకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో మాజిమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో ఏడాది కాలం నిర్వహించతలపెట్టిన ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో ఎన్టీఆర్ నటించిన ఎదురీత చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల్లో భాగంగా పట్టణానికి చెందిన సీనియర్ పౌరాణిక కళాకారుడు ఆర్‌విఎస్ ఆంజనేయశర్మను సత్కరించారు. కార్యక్రమంలో అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, యల్లంకి సాంబశివరావు, జానకిరామయ్య, గుమ్మడి ప్రసాద్, తరణి హేమంత్‌కుమార్, పి.పోతురాజు, వి.సుబ్బారావు, డి.భవాని, ఎ.అక్కిరెడ్డి, ఎం.రాఘవరావు పాల్గొన్నారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి

హెచ్ఐవి బాధితులకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-తెనాలి

హెచ్ఐవి రోగులకు హెపటైటిస్ బి త్వరగా సోకే ప్రమాదం ఉందని తెనాలి జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి చెప్పారు. స్థానిక వైద్యశాల్లోని ఏఆర్‌టి సెంటర్‌లో సోమవారం వ్యాక్సినేషన్ పోస్టర్ ఆవిష్కరణ అనంతరం వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ దేశంలో అధికశాతం ప్రజలు హెపటైటిస్ బితో బాధపడుతున్నారన్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఏపి ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, నేషనల్ హెల్త్ మిషన్, నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రామ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రవెన్షన్‌షిప్, సడిసి సహకారంతో రాష్ట్రంలోని అన్ని ఏఆర్‌టి సెంటర్లలో హెపటైటిస్ బి వ్యాక్సినేషన్ జరుగుతుందన్నారు. ఉచితంగా అందించే హెపటైటిస్ బి వ్యాక్సినేషన్ మూడు డోసులు తీసుకోవాలన్నారు కార్యక్రమంలో డాక్టర్ మహేష్ మైత్రి, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ స్నేహ, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరినగరంలోని బ్యాంక్ కాలనీలో ఉన్న19వ వార్డు సచివాలయాన్ని మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమామాలిని రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది అటెండెన్స్ రిజిస్టార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పని సరిగా యూనిఫాంలు ధరించి తమ విధులకు హాజరు కావాలని సూచించారు. అలానే ప్రజలకు ఎల్లపుడూ అందుబాటులో ఉండి సచివాలయ సేవలను అందించాలని అన్నారు. సచివాలయ సెక్రటరీలు వార్డులలో వాలంటీర్లతో కలిసి తప్పని సరిగా పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషిచేయాలని అన్నారు. పరిష్కారం కాని సమస్యల వివరాలు పై అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు.

ఎఎన్‌యు విద్యార్థి భాస్కరరావుకు స్వర్ణపతకం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విద్యార్థి వి భాస్కరరావు విశాఖపట్నం లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, పారా ఒలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియ ఆధ్వర్యంలో జరిగిన 5వ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2023లో లాంగ్ జంప్‌లో స్వర్ణ పతకం, 400, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ బహుమతి వెండి పతకం, తృతీయ బహుమతి రజిత పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా సోమ వారం భాస్కరరావును వర్సిటీలో విసి పి రాజశేఖర్ తదితరులు సన్మానించారు. త్వరలో మహారాష్ట్ర పూణేలో నిర్వహించే జాతీయ పారా ఒలింపిక్ క్రీడలకు భాస్కరరావు ఎంపికయ్యరని, విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని విసి కోరారు.



భాస్కరరావును అభినందిస్తున్న విసి తదితరులు



పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా పోలీసు శాఖ సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుల కోసం ఏర్పాటు చేసిన వాట్సప్ నెంబర్ 8688831574 సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు వరంగా మారింది. ఇటీవల ఫోన్లు పోగొట్టుకున్న వారికి ఈ యాప్ ద్వారా సమాచారం ఇచ్చిన వెంటనే సకాలంలో దర్యాప్తు చేసి ఎవరి ఫోన్లను వారికి అప్పగించినట్టు జిల్లా ఎస్పి ఆరీఫ్‌హాఫీజ్ తెలిపారు. పందిరి సుధాకర్, ఎండూరి హేమంత్, ఎస్ మధన్ మోహన్, సిహెచ్ మాధురి, వేణిగంటి నాగభూషణ్ తదితరులు గుంటూరు లో నివాసం ఉంటున్నారు. అయితే వీరంతా ఫోన్ లు పొగొట్టుకుని ఫిర్యాదు చేయగా వెంటనే దర్యాప్తు చేసి అందించారు. ఫోన్ పొగొట్టుకున్న వారి కేసుల దర్యాప్తు నోడల్ అధికారిగా అదనపు ఎస్పి సుప్రజ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ, తదితరులు

స్టెప్‌కాన్ సదస్సులో ఆర్‌విఆర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

విజయనగరంలో జిఎంఆర్ఐటి కళాశాలలో నిర్వహించిన స్టెప్‌కాన్-2023 జాతీయ సదస్సులో తమ కళాశాల విద్యార్థుల ప్రతిభకు ఓవరాల్ ఛాంపియన్ 2వ స్థానంలో నిలిచి బహుమతి అందుకున్నారని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుండి అనేక కాలేజిల విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ప్రాజెక్టులు రూపొందించి, ప్రదర్శించారని, ఆర్‌విఆర్ విద్యార్థులు రూపొందించిన గోకాట్ వాహనానికి ఓవరాల్ ఛాంప్ 2వ స్థానం సాధించి సర్టిఫికెట్‌ను రూ.20వేల నగదు బహుమతి అందుకున్నారన్నారు.ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగండి

పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : పాతగుంటూరు పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పి ఆరిఫ్ హాఫీజ్ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేసారు. పాత గుంటూరు పోలీస్ స్టేషన్ లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీటి దర్యాప్తును వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసు స్టేషన్ కు ఫిర్యాదు చేయుటకు వచ్చే ఫిర్యాదులుదారులు పట్ల మర్యాదగా మాట్లాడి వారి యొక్క సమస్య తెలుసుకొని వారికి న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. స్టేషన్ లో నమోదైన వివిధ కేసుల వివరాలను ఇటీవల స్టేషన్ భాద్యతలు తీసుకున్న సి ఐ సుబ్బారావు అడిగి తెలుసు కున్నారు అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచవల సినదిగా ఆదేశాలు జారీ చేసారు. రాత్రి సమయంలో రక్షక వాహనాలతో పెట్రోలింగ్ , నైట్ బీట్ డ్యూటీ చేస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.డిఎస్‌పి సీతారామయ్య, సిఐ సుబ్బారావు, స్పెషల్ బ్రాంచి సిఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



16 వేల మందికి ఉచితంగా హెపటైటిస్ బి వ్యాక్సిన్

ప్రజాశక్తి-గుంటూరు

హెచ్.ఐ.వి/హైరిస్క్ గ్రూపుల వారికి హెపటైటిస్ బి వైరస్ టీకా (వ్యాక్సిన్)ను అన్ని ఎ.ఆర్.టి కేంద్రాల్లో సోమవారం నుండి ఉచితంగా అందిస్తున్నట్లు జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టిబి ఆఫీసర్ డాక్టర్ బి.లక్ష్మానాయక్ తెలిపారు. హెచ్.ఐ.వి/ హై రిస్క్ గ్రూపుల వారికి హెచ్.ఐ.వి, హెపటైటిస్ బి సోకే అవకాశం ఎక్కువ అని టీకాలు తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా రక్షణ పొందవచ్చన్నారు. సోమవారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి ఎ.ఆర్.టి ప్లస్ సెంటర్‌లో హెపటైటిస్ బి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆసుపత్రి ఏఆర్‌టి ప్లస్ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పిఎస్ ఉషారాణి, డాక్టర్ భూక్యా లక్ష్మనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పేషెంట్ల అవగాహన కొరకు పోస్టర్లు విడుదల చేశారు. డాక్టర్ లక్ష్మానాయక్ మాట్లాడుతూ నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, నేషనల్ హెల్త్ మిషన్, నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రామ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్, పెప్ ఫార్ మరియు షేర్ ఇండియా, సహకారంతో జిల్లాలోని జిజిహెచ్ ఏఆర్‌టి సెంటర్, ప్రభుత్వ చెస్ట్, కమ్యూనికబుల్ డిసీజ్ హాస్పిటల్, ఎన్ఆర్ఐ హాస్పిటల్, తెనాలి ఏఆర్‌టి సెంటర్లలో 16వేల మందికి హెచ్.ఐ.వితో జీవించేవారు, హైరిస్క్ గ్రూపు వారైన సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ట్రాన్స్ జండర్లు, వలస దారులకు ఉచితంగా హెపటైటిస్ బి వ్యాక్సిన్ వేయనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌టి ప్లస్ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రభాకరరావు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎల్.మధుసూధనరావు, జిల్లా ఐసిటిసి సూపర్వైజర్ జ్యోతుల వీరాస్వామి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ భూక్యా లక్ష్మనాయక్, డాక్టర్ ఉషారాణి తదితరులు

కృష్ణా జలాశయంలోకి 2.70 లక్షల చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి - విజయపురి సౌత్

నాగార్జునసాగర్ విజయపురిసౌత్లోని లాంచీస్టేషన్ వద్ద మిషన్ ఫింగర్ లింక్స్ పథకంలో భాగంగా 2.70 లక్షల చేప పిల్లలను సోమవారం కృష్ణా జలాశయంలోకి విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కండరెడ్డి, సభ్యులు శేరెడ్డి గోపిరెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, డీఎఫ్ఒ సంజీవ్, డీఏవో ఐ.మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక మత్స్యకారుల జీవనోపాధిలో భాగంగా జలాశయంలోకి చేప పిల్లలను విడుదల చేయడం జరిగిందన్నారు. సీఎం జగన్ మత్స్యకారుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్థానిక మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం న్నారు. స్థానిక మత్స్యకారులందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు . కార్యక్రమంలో ఎఫ్‌టిఒ కిషోర్ రెడ్డి, మాచర్ల ఏవో లక్ష్మారెడ్డి, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు కారే ముసలయ్య, స్థానిక వైసీపీ నాయకులు పూరి, నూకరాజు, ఆనంద్ పలువురున్నారు.



జలాశయంలోకి చేప పిల్లలను విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధుల

మానవ అక్రమరవాణాపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థలో సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ నిర్బందంపై వన్‌స్టాప్ క్రైసిస్ బృందం, ప్యానల్ అడ్వకేట్స్, పారా లీగల్ వాలంటీర్లకు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఇండియా తరపున విలియం క్రిస్టఫర్ మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ నిర్బంద చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నకుమార్ మాట్లాడుతూ సమస్యలు ఎదురైనప్పుడు వారికి అండగా, న్యాయసహాయం అందించటానికి న్యాయసేవాధికార సంస్థలు, పారా లీగల్ వాలంటీర్లు, ప్యానల్ అడ్వకేట్స్ కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఐజెఎం సభ్యులు సీనియర్ న్యాయవాది కట్టాకాళిదాసు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రత్నకుమార్



హిందూ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం నిర్వహించారు. తొలుత కళాతపస్వి కె విశ్వనాథ్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ యుఎంవి నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఫార్మసీ విద్యార్థులకు ఔషధ సంస్థల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు కళాశాల ఛైర్మన్ జూపూరి రంగరాజు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ఛైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సదర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

రేపు గుంటూరులో మిర్చి రైతుల సదస్సు

హాజరుకానున్న వ్యవసాయశాఖ మంత్రి కాకాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : మిర్చి పంట సాగులో మెళుకవులు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడం, తక్కువగా పురుగు మందుల వినియోగం తదితర అంశాలపై ఈనెల 8వ తేదీన గుంటూరు ఎఎస్‌ఆర్ కనెన్వన్ హాలులో రైతు సదస్సు నిర్వహిస్తున్నట్టు అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ డిజిటల్ గ్రీన్ అధినేత కందిమళ్ల నరేంద్ర తెలిపారు. గుంటూరులోని ఒక హోటల్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బుధవారం జరిగే ఈ సదస్సును వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. మిర్చి రైతుల ఉత్పాదకత, ఆదాయం, సామర్థ్యాలను పెంచడానికి నూతన డిజిటల్ సాంకేతికత ఆవిష్కరణలను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. గత రెండేళ్లుగా తమసంస్థ గుంటూరు,కృష్ణా, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. సలహాలు, సూచనలు వాట్సాప్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ఈ కామర్స్ లింక్డ్ ద్వారా మార్కెట్ సేవలు కూడా అందిస్తున్నట్టు చెప్పారు. ఈ సదస్సులో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.